క్లుప్తంగా

నేడు తలకొండపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

తలకొండపల్లి: పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు బుధవారం మండలంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పర్యటించనున్నారని ఎంపీడీఓ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతారంలో.. గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, పల్లె దవాఖానాకు శంకుస్థాపన, దేవుని పడకల్‌లో.. వైకుంఠధామం, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, వెంకటాపూర్‌తండాలో.. వైకుంఠధామం, డంపింగ్‌యార్డు ప్రారంభోత్సవం, గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన, పెద్దూర్‌తండాలో వైకుంఠధామం, డంపింగ్‌యార్డు.. తలకొండపల్లి నుంచి పెద్దూర్ తండా వరకు వేసిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని ఎంపీడీఓ తెలిపారుజ. అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలని కోరారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మాధవి

తుర్కయంజాల్: దశలవారీగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు 8వ వార్డు కౌన్సిలర్ మర్రి మాధవి తెలిపారు. మంగళవారం మన్నెగూడలోని సర్వే నంబర్ 18, 19లోని శ్రీసాయినగర్‌కాలనీలో మంచినీటి పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ పైప్‌లైన్‌తో కాలనీవాసులకు తాగునీటి ఇబ్బందులు తప్పనున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీను, సెక్రటరీ బిచ్యానాయక్, కాలనీవాసులు రాజేందర్, లింగస్వామి, అఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ట్రాఫిక్ సీఐ నాగమల్లు

యాచారం: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ అంజమల్ల నాగమల్లు అన్నారు. నందివనపర్తి ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా 'పుస్తక పఠనం–ప్రాధాన్యత' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయిలోనే పుస్తకాలను స్నేహితులుగా భావించి కష్టపడి చదువుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మశ్రీ, వెంకట్‌రెడ్డి, పరమేశ్, అజయ్, భోజయ్య, అరుణ, శ్రీలత, సుధారాణి పాల్గొన్నారు.

'రాధాకృష్ణ' ట్రస్ట్ సేవలు అభినందనీయం

జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్



బాధిత కుటుంబాలకు నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కడ్తాల్: జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈట గణేశ్ ప్రశంసించారు. మండల పరిధిలో మృతి చెందిన 157 కుటుంబాలకు మంగళవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5వేల చొప్పున మొత్తం రూ.7.85 లక్షలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన గణేశ్ మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు మోత్యానాయక్, అనిత, జెడ్పీటీసీ అనురాధ, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీలు ఆనంద్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పీఎస్ ఎదుట మృతదేహంతో ఆందోళన

ఇబ్రహీంపట్నం రూరల్: చిన్నారి భావన మృతదేహంతో మంగళవారం కుటుంసభ్యులు ఆదిబట్ల పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొట్టడంతో భావన మృతి చెందిన విషయం తెలిసిందే. తమకు న్యాయం చేయాలని భావన మృతదేహంతో చిన్నారి కుటుంబ సభ్యులు గంటపాటు ఆందోళన చేపట్టారు. విద్యార్థి కుటుంబానికి పలు పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు మద్దతు పలికారు. అయితే పాఠశాల యాజమాన్యం బాధితులతో చర్చలు జరపడంతో వారు ఆందోళన విరమించారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి: ఏఓ

తలకొండపల్లి: అర్హులందరూ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా రిజిస్టర్ అయ్యే రైతులందరికీ బీమా వర్తింపజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూన్ 18 వరకు పాసుబుక్ పొందినవారు ఆగస్టు 5లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, నామినీ ఆధార్ జిరాక్స్‌ను ఏఈఓలకు ఇవ్వాలని వ్యవసాయాధికారు రాజు పేర్కొన్నారు.

చదువుతో పాటు విజ్ఞానం

- ఆకట్టుకుంటున్న 'రూమ్ టూ రీడ్' గ్రంథాలయాలు
- అనాజ్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు
- బొమ్మలతో కూడిన కథల పుస్తకాలు, మరెన్నో..
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్‌పై మెళకువలు నేర్పుతున్న ఉపాధ్యాయురాలు

అబ్దుల్లాపూర్‌మెట్: మనం చురుగ్గా ముందుకు దూసుకుపోవాలంటే శరీరం ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసికంగా ధృడంగా ఉండాలి. అలా ఉండాలంటే ముందుగా మన మెదడును చురుగ్గా ఉంచుకోవాలి. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో.. మెదడుకు చదవు కూడా అంతే అవసరం. చదువు వల్ల మెదడు చురుగ్గా మారుతుంది. అయితే అందరూ విజ్ఞానంపై దృష్టి సారించేందుకు ఆసక్తి చూపరు. ముఖ్యంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి చూసేవారి సంఖ్య తక్కువే అని చెప్పాలి. ఇలాంటి పరిస్థితిలో పుస్తక పఠనంపై ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఆసక్తి చూపించడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు 'రూమ్ టూ రీడ్' అనే స్వచ్ఛంద సంస్థ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి మించిన గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తోంది. ఆయా గ్రంథాలయాల్లో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బొమ్మలతో కూడిన కథల పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నారు.

విద్యార్థుల ఆసక్తి..

'రూమ్ టూ రీడ్' స్వచ్ఛంద సంస్థ సర్వశిక్షా అభియాన్ సహకారంతో పనిచేస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం, గోడలపై రకరకాల రంగుల్లో బొమ్మలను గీయించి గ్రంథాలయాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దటం వీరి పని. ఈ కోవలోనే అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా పుస్తకాలను ఎంపిక చేసుకుని బోధిస్తున్నారు. ఇక్కడ విద్యతో పాటు డ్రాయింగ్ శిక్షణ, ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు. అమెరికాకు చెందిన జాన్‌హుడ్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి 2000 సంవత్సరంలో రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ప్రపంచవ్యాప్తంగా 10దేశాల్లో... భారతదేశంలోని 13 రాష్ట్రాల్లో ఈ సంస్థ సేవలను అందిస్తోందని అనాజ్‌పూర్ గ్రంథాలయ టీచర్ విజయలక్ష్మి తెలిపారు.



పాఠశాలలోని గ్రంథాలయం

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి వినతి



కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.40 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంగళవారం మంత్రి కేటీఆర్‌ను ప్రగతి భవన్‌లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కలిసి కోరారు. నియోజకవర్గంలోని ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు గాను నిధులు మంజూరుచేయాలని విన్నవించారు. అదేవిధంగా పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కేంద్రం నుంచి పసుమాముల వరకు రోడ్డు వెడల్పుకు నిధులు మంజూరుచేయాలని, హనుమాన్‌నగర్ ఊరచెరువు ట్రంక్‌లైన్‌ను నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై మంత్రితో చర్చించారు.

రేవంత్ మాటలు సిగ్గుచేటు..

ఇబ్రహీంపట్నం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయాన మాట్బాడారు. తానా మహాసభల్లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అవసరంలేదని.. మూడు గంటల కరెంట్ మాత్రమే రైతులు కోరుకుంటున్నారని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రైతాంగం పట్ల కాంగ్రెస్ పార్టీ విధానాలకు అద్దం పట్టేలా రేవంత్‌రెడ్డి వాఖ్యలున్నాయన్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసులేకుండా చేస్తారని హెచ్చరించారు. రేవంత్ వాఖ్యలకు నిరసగా మండల కేంద్రాల్లో బుధవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

బీఆర్‌ఎస్ నేత జంగయ్య

తుర్కయంజాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని తుర్కయంజాల్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ 11వ వార్డు ఇన్‌చార్జి జంగయ్య తెలిపారు. మంగళవారం తుర్కయంజాల్‌లో ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మాజీ సర్పంచ్ దశరథ, నాయకులు శ్రీశైలం, ధన్‌రాజ్, పవన్‌గౌడ్, బాబయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సీఐ కాశీవిశ్వనాథ్



మాట్లాడుతున్న సీఐ కాశీవిశ్వనాథ్

మంచాల: చట్టాలను అందరూ గౌరవించాలని మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ అన్నారు. మంగళవారం చిత్తాపూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సోదరభావంతో మెలగాలన్నారు. గ్రామాల్లో గొడవలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మోటారు సైకిళ్లు నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో మెలిగితేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్ నాగరాజు గౌడ్, వార్డుసభ్యులు చంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్ల ప్రారంభం



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కడ్తాల్: మండలంలోని రావిచేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ రావిచేడ్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మరుగుదొడ్ల సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. మంగళవారం ట్రస్ట్ సభ్యులు.. స్థానిక నాయకులతో కలిసి పాఠశాలలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేశ్, సింగిల్ విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, వార్డు సభ్యులు మల్లేశ్‌యాదవ్, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ రవి, హెచ్‌ఎం దేవేందర్, తిరుపతినాయక్, రాంచంద్రయ్యగౌడ్, రాజు, రమేష్, ఆమీర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేద్దాం

టీఎస్ యూటీఎఫ్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

యాచారం: సీపీఎస్‌ను రద్దుచేసే వరకు పోరాటం కొనసాగిస్తామని టీఎస్ యూటీఎఫ్ శ్రేణులు పేర్కొన్నారు. ఈనెల 23న జరిగే రాష్ట్రస్థాయి సదస్సుకు సంబంధించి వాల్‌పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో వారు ఆవిష్కరించారు. 40 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగం చేసి సర్వీస్ అందించిన ఉద్యోగి రిటైర్ అయ్యాక కూడా పెన్షన్‌కు నోచుకోకపోవడం దారుణమని అన్నారు. చివరి దశలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహ, అంజయ్య, జంగయ్య, ఆంజనేయులు, జగదీష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సందీప్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. రేనుకుంట్ల సందీప్(25) అతని స్నేహితుడు సాయిఉపేందర్(23) శనివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా పెద్దచెరువు కట్టపై జరిగిన ప్రమాదంలో సందీప్, సాయిచంద్‌కు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. వెంటనే వారిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ నేపథ్యంలో సందీప్ చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ కావడంతో మంగళవారం మృతిచెందాడు. అతడి స్నేహితుడు సాయిఉపేందర్‌కు ప్రాణాపాయంలేదని వైద్యులు తెలిపారు. సాయిఉపేందర్ స్వస్థలం భువనగిరి కాగా ఉద్యోగా రీత్యా ఉప్పల్‌లో ఉంటున్నాడు. స్నేహితులిద్దరూ నగరంలోని గచ్చిబౌలిలో గల ఎస్సెంచర్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. వెనుకవైపు నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం.. బైక్‌ను ఢీకొట్టడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కొడుకు సందీప్ మృతి చెందడంతో తండ్రి సురేష్, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, కాంగ్రెస్ నేత ఈసీ శేఖర్‌గౌడ్, మాజీ ఎంపీపీ నిరంజన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు, కౌన్సిలర్ భాస్కర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందిరాల రమేష్ తదితరులు అంత్యక్రియలకు హాజరై సందీప్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులతో మంగమ్మ, శివకుమార్

తుర్కయంజాల్: దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలుగా నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ అన్నారు. తుర్కయంజాల్‌లోని కాశీంగుట్ట వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవాలయాన్ని మంగళవారం ఆమె కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి వ్యక్తిగతంగా రూ.3.60 లక్షలను విరాళంగా ఇవ్వనున్నట్లు మంగమ్మ ప్రకటించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఎస్సీ నాయకులు శివకుమార్, మాజీ సర్పంచ్ అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు మల్లయ్య, బాల నర్సింహ, అశోక్, స్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె

ప్రభుత్వానికి మధ్యాహ్న భోజన కార్మికుల హెచ్చరిక



ఆమనగల్లు: ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు



హయత్‌నగర్: అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఆమనగల్లు: మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కురుమయ్య డిమాండ్ చేశారు. ఆమనగల్లు ఎంఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి వారు ధర్నా నిర్వహించారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్మికులు.. పద్మ, పార్వతమ్మ, పెంటమ్మ, శంకరమ్మ, శాంతమ్మ, ఖాజాబీ, రజియాబేగం, సుగుణమ్మ, ఈశ్వరమ్మ, పార్వతమ్మ, అలివేలు, యాదమ్మ, ఎల్లమ్మ, ఆమీన తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిరండి..

ఇబ్రహీంపట్నం: రెండు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి స్వప్న, సీఐటీయూ నాయకులు పాచమోని కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. ఈ మేరకు ఇబ్రహీంపట్నంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేపట్టారు. బుధవారం చేపట్టే కలెక్టరేట్ ముట్టడికి కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం నాయకులు సరిత, ప్రేమలత, పుష్పమ్మ, శిరీష, సుగుణమ్మ, కల్పనా, జంగమ్మ, అలివేలు పాల్గొన్నారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం..

హయత్‌నగర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకుడు నర్సింహ హెచ్చరించారు. హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ నేతలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కార్మికులు లక్ష్మమ్మ, రమాదేవి, భాగ్యమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అప్పులపాలవుతున్నాం..

యాచారం: మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెలో పాల్గొన్న కార్మికులు మాట్లాడుతూ.. అప్పులుచేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నామని, ఆరునెలలకోసారి కూడా బిల్లులు రావడం లేదని అన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, జిల్లా కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 9వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం మండలం ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

మంచాల: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం మంచాల మండల కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, ఖాజాపాష, భాస్కర్, నాయకులు మాధవి, జంగయ్య, శంకరయ్య, సురేష్, యాదయ్య, జంగయ్య, దర్శన్, స్వరూప, అర్జున్, సురేష్, దాసు జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి..

తలకొండపల్లి: పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని గౌడ సంఘం తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం తలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులకు ఆయన మద్దతు తెలిపారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ నాయకులు కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కిరణ్‌పూలే, శ్రీకాంత్, విజయ్, గణేష్, వెంకటేశ్, రమేష్, రాజు, కుమార్, కృష్ణ, పవన్, యాదమ్మ, రవలి, సభ్యులు యాదమ్మ, బిక్షపతి, అలివేలు, జంగమ్మ, అలివేలు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 67, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 95, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 45, దొండ 28, ఆలు 21, ఉల్లి 22, గోకర 28, దోస 23, సార 15, పొట్ల 23, అరటి 11, చిక్కుడు 55, అర్వి 37, మునగ 48, చిలగడదుంప 26, బీట్‌రూట్ 25, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 95, కాప్సికమ్ 75. గమనిక: బుధవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

మా పంచాయతీని 'ఇర్విన్'లో కలపొద్దు

పల్గుతండా వార్డుసభ్యుల రాజీనామా



రాజీనామా పత్రాలు అందిస్తున్న వార్డుసభ్యులు

ఆమనగల్లు: నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇర్విన్ మండలంలో పల్గుతండా గ్రామ పంచాయతీని కలపడాన్ని నిరసిస్తూ ఆ పంచాయతీ వార్డుసభ్యులు రాజీనామా చేశారు. ఈ మేరకు మాడ్గుల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పల్గుతండా వార్డు సభ్యులు మేరావత్ కవిత, బానావత్ సునీత, లాలు, జటావత్ లాలు తమ రాజీనామా పత్రాలు అందించారు. పల్గుతండాను మాడ్గుల మండలంలోనే ఉంచాలని వారు కోరారు. అలాగే నర్సంపల్లి, చెట్లగుట్టతండాలను మాడ్గుల మండలంలోనే కొనసాగించాలని ఆయా గ్రామల ప్రజలు మంగళవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయరెడ్డికి వినతిపత్రం అందించారు. మాడ్గుల మండలంలోని సుద్దపల్లి గ్రామాన్ని మాడ్గుల మండలంలోనే కొనసాగించాలని మాజీ సర్పంచ్ జానకిరాములు యాదవ్, ఎంపీటీసీ గ్యార వెంకటయ్య, ఉపసర్పంచ్ కొప్పుల శేఖర్‌గౌడ్, నాయకులు రాములుయాదవ్, ఆంజనేయులు యాదవ్, హరికృష్ణ యాదవ్.. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇంటి పన్నులు తగ్గించండి: బీజేపీ



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: పెంచిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమనగల్లు పట్టణంలో బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పన్నులు తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టి.. మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, లక్ష్మణ్, చెన్నకేశవులు, శ్రీశైలంయాదవ్, బీజేపీ నాయకులు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

'ఆడపడుచులకు వరం.. కల్యాణలక్ష్మి'



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఒక వరమని, ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్, ఉప్పల మండలాలకు చెందిన 90 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల కష్టాలను తీర్చడానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ పథకాలు ఎంతో దోహద పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్, సరూర్‌నగర్ డీటీ అవినాష్‌కుమార్ పాల్గొన్నారు.